క్లుప్తంగా

కోడుమూరు ఎంపీడీఓగా రాముడు



కార్యదర్శులతో మాట్లాడుతున్న రాముడు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎంపీడీఓగా రాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న చంద్రశేఖర్ పాములపాడుకు బదిలీపై వెళ్లడంతో ఉన్నతాధికారులు సి.బెళగల్‌లో పనిచేస్తున్న రాముడుని నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటు ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సూచించారు.

గడివేముల...



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకించిన వాసుదేవ గుప్త

గడివేముల: ఎంపీడీఓగా వాసుదేవ గుప్త శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓను పంచాయతీకార్యదర్శులు,సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

కల్లూరు ఎంపీడీఓగా..



బాధ్యతలు చేపట్టిన నాగశేషాచలరెడ్డి

కర్నూలు (రూరల్) : కర్నూలు (రూరల్) : కల్లూరు మండల ఎంపీడీఓగా నాగ శేషాచల రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మిడుతూరు నుంచి కల్లూరుకు బదిలీపై వచ్చారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని, గౌరు వెంకటరెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

కర్నూలు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన రఘునాథ్



కర్నూలు (రూరల్) : కర్నూలు మండల ఎంపీడీఓగా జి.రఘునాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా నుంచి ఈయన కర్నూలు ఎంపీడీఓగా వచ్చారు. గతంలో కర్నూలు మండల ఈఓఆర్డీగా ఈయన ఇక్కడే పనిచేశారు. కర్నూలు మండల వైస్ ఎంపీపీ నెహెమ్యా, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, పేరపోగు మోహన్ బాబు, పడిదెంపాడు వెంకటేశ్వర్లు ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

సి.బెళగల్ ఎంపీడీఓగా ...



బాధ్యతలు స్వీకరిస్తున్న రాణెమ్మ

సి.బెళగల్: ఎంపీడీఓగా రాణెమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించే ఎంపీడీఓ రాముడు కోడుమూరుకు బదిలీకాగా ఆయన స్థానంలో ఆస్పరి మండలం నుంచి ఆమె ఇక్కడి వచ్చారు. ఈఓఆర్డీ సందీప్ నందవరం మండలానికి, అక్కడ విధులు నిర్వర్తించే ఈశ్వరయ్యస్వామిని సి.బెళగల్ మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు ఈశ్వరయ్యస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓతపాటు ఈఓఆర్డీని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కలిసి అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ వెంకటరమణ



గడివేముల: గడివేము ల తహసీల్దార్‌గా వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న విద్యాసాగర్ ఓర్వకల్లుకు బదిలీయ్యాడు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

ఘనంగా చిన్న కాశీంస్వామి సరిగెత్తు

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో శుక్రవారం చిన్నకాశీంస్వామి సరిగెత్తు ఘనంగా జరిగింది. చిన్నకాశీలంపీరును ప్రత్యేకంగా అలంకరించి పురవీధులలో ఊరేగించారు. ఎమ్మెల్యే గౌరు చరితా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వరికి తెగులు.. రైతన్న దిగాలు

- చుట్టుముట్టిన ఎండుటాకు, ఆకుముడత, కాండం తొలుచు పురుగులు
- ఎర్రవగా మారిన వరిపైరు
- ఏ మాత్రం ప్రభావం చూపని మందులు పిచికారీ



దుర్వేశిలో ఎర్రగా మారిన వరిపైరు

గడివేముల: రైతన్నను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగైన వరిపైరును తెగుళ్లు ఆశించాయి. దీంతో రైతన్న దిగాలు చెందుతున్నాడు. వర్షాభావ పరిస్థితుల మూలంగా ఎండుటాకు, ఆకుముడత, కాండం తొలుచు పురుగులు వరిపైరును చుట్టుముట్టాయి. పైరు రంగు పూర్తిగా మారిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండుటాకు తెగుళ్లతో వరిమొక్క కోసలు ఎండిపోయి పంట ఎర్రగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చెస్తున్నారు. ఎన్నిరకాల మందులు వాడిన ఫలితం లేకుండా పోయిందని అన్నదాతలు చెబుతున్నారు. పంట ఎదుగుదల నిలచిపోయిందని వాపోతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 18,332 వేల ఎకరాలలో వివిధ పంటలు సాగు చేశారు. నాలుగు వేల ఎకరాల్లో వరి పంటను సాగు అయ్యింది. మండల పరిధిలోని దుర్వేశి, కోరటమద్ది, తిరుపాడు, చిందుకూరు, పెసరవాయి, కరిమద్దెల, మంచాలకట్ట గ్రామాల్లో రైతులు వరిపంటను అధికంగా సాగు చేశారు. మూడు నెలల వరిపైరను తెగుళ్లు ఆశించాయి.

దిగుబడులపై ప్రభావం

వరిపైరును ఎండుటాగు, ఆకుముడత, కాండం తొలుచు తెగుళ్లు ఆశించడంతో దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడులు వస్తాయి. అయితే తెగ్గళ్ల మూలంగా ఈయేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఐదు నుంచి పది బస్తాల వరకు దిగుడులు తగ్గే అవకాశం ఉందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు



వరి పంటకు ఎండుటాగు, ఆకుముడత, కాండం తొలుచు తెగుళ్లు ఆశించా యి. ఎన్నిమందులు వాడినా ఫలితం లేకుండా పోయింది. నేను 3 ఎకరాల్లో వరిపంటను సాగుచేశా. దాదాపు రూ. 30 వేల వరకు ఖర్చు చేశా. మంచి దిగుబడులు వస్తాయనుకున్నా. ఇప్పడా పరిస్థితి లేదు. వరిపైరుకు తెగుళ్ల సోకడంతో కొంత వరకు దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది.

–శివుడు, రైతు, గడిగరేవుల

దిగుబడులు తగ్గుతాయోమో....



రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. ఇప్పటి వరకు పెట్టుబడి ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చు అయ్యింది. గతేడాది ఎకరాకు 30 బస్తాలు వచ్చాయి. ఈ ఏడాది తెగుళ్ల కారణంగా 25 బస్తాలు రావడమే అనుమానంగా ఉంది. వర్షాభావ పరిస్థితుల మూలంగా వరి పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. వరి నాటిన కొన్ని రోజులకే ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో ఎండుటాకు, కాండం తొలుచు తెగుళ్లు సోకాయి. దీంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉంది.

– కేశవరావు, గడివేముల

అప్రమత్తంగా ఉండాలి



అధిక వర్షాలు కురిసినప్పుడు వరి పంటకు తెగుళ్లు సోకే అవకాశాలు ఎక్కువ. రైతులు దిగాలు చెందకుండా అప్రమత్తంగా ఉండాలి. పైరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలి. ఎండుటాకు తెగులు సోకిన వరికి యూరియాను చల్లొద్దు. కార్టఫ్‌హైడ్రోక్లోరైడ్‌ను ఎకరానికి 400 గ్రాములను పిచికారీ చేస్తే తగ్గిపోతుది. అలాగే ఎండుటాగు, ఆకుముడత, కాండం తొలుచు తెగుళ్లు అధికంగా ఉన్న పంటలకు సెప్టోసైక్లిన్, ప్యాంటోమైసిన్ యాంటిబయోటిక్ మందులను పిచికారీ చేయాలి.

–హేమసుందర్‌రెడ్డి,ఏఓ,గడివేముల

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు మెట్ట వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. బలపనూరు హైవే వద్ద రోడ్డు దాటుతుండగా పాణ్యం నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో కాలుకు గాయమైందన్నారు. చికిత్స నిమిత్తం శాంతిరామ్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

దొంగల అరెస్ట్

సి.బెళగల్: సి.బెళగల్‌తో పాటు గూడూరు, కోడుమూరు మండలాలలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు నిందితులకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఎస్ఐ వివరించారు. 2024లో నమోదైన ఎనిమిది దొంగతనం కేసుల నిందులపై విచారించామన్నారు. గూడూరు టౌన్‌లోని పడమటి బీసీ కాలనీకి చెందిన కుక్కల రామాంజనేయులు, సి.బెళగల్ మండలంలోని మారందొడ్డికి చెందిన బోయ శ్రీనివాసులు, కోడుమూరు మండలం పుల్లకూర్తికి చెందిన బోయ వేణులను నిందితులుగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. గాలింపు చేపట్టి సి.బెళగల్‌లోని కొటారు మిట్ట ప్రాంతంలో ముగ్గరు ముద్దాయిలను గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. నిందుతుల నుంచి రెండు సెల్ ఫోన్లతో పాటు 24 గ్రాముల బంగారం, 270 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

విద్యుత్ కెపాసిటర్ బ్యాంక్ ప్రారంభం



కెపాసిటర్ బ్యాంక్‌ను ప్రారంభించిన ఈఈ శేషాద్రి

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడలో కొత్తగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కాపాసిటర్ బ్యాంక్‌ను శుక్రవారం ఆ శాఖ ఈఈ శేషాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15 లక్షలతో కెపాసిటర్ బ్యాంక్ ఏర్పాటు చేశామన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, బుక్కాపురం గ్రామాలకు లోఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. కెపాసిటర్ బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేసిన స్థానిక ఏఈ సునీల్‌బాబును ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఈఈ సుబ్బన్న, ప్రొటెక్షన్ డీఈ శారద, ఏఈ సునీల్‌బాబు, కాంట్రాక్టర్ బొల్లారం వెంకటేశ్వర్లు, వెంకటశివారెడ్డి, సబ్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



గాయాత్రిదేవి అలంకరణలో శ్రీవల్లెలాంబదేవి



గాయత్రిదేవి అలంకరణలో దర్శనమిస్తున్న కె.నాగలాపురం సుంకులా పరమేశ్వరీ



బాలత్రిపుర సుందరి అలంకరణలో శ్రీకన్యకా పరమేశ్వరీ

మహిళలు క్రీడల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఆర్‌యూ వీసీ యన్.టీ.కె. నాయక్

కర్నూలు (టౌన్): మహిళలు క్రీడల్లో రాణించాలని, తద్వారా మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ యన్.టీ.కె.నాయక్ అన్నారు. శుక్రవారం రామచంద్రనగర్‌లోని సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాలలో ఆర్‌యూ అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రిన్సిపాళ్లు జానీబాషా, సుందర్ రాజు, ఆర్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో వివిధ కళాశాలల నుంచి 15 కబడ్డీ, చెస్ జట్లు పాల్గొన్నాయి.

కబడ్డీ పోటీల ఫలితాలు

కర్నూలు శంకరాస్ డిగ్రీ కళాశాల జట్టు నందికొట్కూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. అలాగే కర్నూలు సాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు నందికొట్కూర్ బసిరెడ్డి డిగ్రీ కళాశాల జట్టుపై, కర్నూలు శ్రీలక్ష్మీ బీపీఈడీ జట్టు నంద్యాలకు చెందిన రామకృష్ణ డిగ్రీ కళాశాల జట్టుపై, సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల జట్టు ఎమ్మిగనూరు ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించాయి.

గాయత్రి అలంకరణలో అమ్మవారు



వల్లెలాంబదేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



గాయత్రిదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని వల్లెలాంబదేవి, కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాతా, శ్రీరాములమ్మ, తులజా భవానీ, అంబా భవానీ దేవాలయాల్లో అమ్మవార్లు బహు రూపాల్లో దర్శనమిచ్చారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక అలంకరనలో దర్శనమిచ్చిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవా కనుల పండువగా నిర్వహించారు. కండెక్టర్ నాగరాజు కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరులో...

దసరా శరన్నవరాత్రోత్సవాల్లోభాగంగా శుక్రవారం గూడూరు మండలంలోనూ అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో వెలసిన సుంకుల పరమేశ్వరీ అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సి.బెళగల్: దసరా ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చలకులు సుదర్శణమాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోమట వీధిలో కొలువైన వాసవి కన్యక పరమేశ్వరి దేవికి గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి భక్తులు అభిషేకం, కుంకుమ అర్చన తదితర పూజలు చేశారు.

గడివేముల: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రం గడివేములలో వాసవీమాత మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు వసంతలక్ష్మి,సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదనగుప్త, ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్, మల్లికార్జున, కార్యదర్శి సీవీరమణయ్య, ఈపూరి పద్మనాభయ్య తదితర భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పాణ్యం: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. హైంధవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు గాయంత్రిదేవిగా దర్శనమ్విగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఓర్వకల్లు: దేవీ శరన్నవాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లొద్దిపల్లె, బైరాపురం, హుసేనాపురం, నన్నూరు, ఓర్వకల్లు గ్రామాలలో కొలువైన అమ్మవారికి భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హుసేనాపురంలోని సంతమార్కెట్, లొద్దిపల్లెలో మెయిన్ రోడ్డులో కొలువైన అమ్మవారికి పురోహితులు జంధ్యాల మనోహర్‌శర్మ, మద్దిలేటి అభిషేకాలు నిర్వహించారు. లొద్దిపల్లెలో డీజే మధు బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది.



పాణ్యం: పార్వతి దేవి అలంకరణలో అమ్మవారు



గాయత్రిదేవి అలంకరణలో...



గడివేముల: మహాలక్ష్మిదేవి అలంకరణలో అమ్మవారు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కర్నూలు: నగర శివారు కోడుమూరు రోడ్డులోని రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న సురేష్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె గ్రామానికి చెందిన ఈయన కర్నూలులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్నాడు. ఇతనికి కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన సుజాతతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక తరచూ భార్యాభర్తలు గొడవ పడుతుండేవారు. ఇటీవల భార్య సురేష్‌తో గొడవపడి పుట్టింటికి వెళ్లింది. గురువారం ఇంటి పక్కనున్న బాబు, అతని కుమారుడు బన్ని తనను కొట్టి గాయపరిచారని కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పి తర్వాత స్విచాఫ్ చేసి గదిలో తాడుతో ఉరి వేసుకున్నాడు. ఘటనపై కోడలు, ఆమె కుటుంబ సభ్యులే తన కుమారుడి మృతికి కారకులని బాధితుడి తల్లి రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

'అమెరికా భారతి'లో కర్నూలు కథ

కర్నూలు కల్చరల్: అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) వారు నిర్వహించే 'అమెరికా భారతి' తెలుగు పత్రికలో కర్నూలుకు చెందిన కథా రచయిత ఇనాయతుల్లా రచించిన 'అదృశ్యం కాని దృశ్యం' కథ ప్రచురితమైంది. వార్ధక్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల ప్రస్తుత తరం యువత చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి, పతనమవుతున్న మానవ సంబంధాల గురించిన ఇతివృత్తం కల్గిన ఈ కథ తల్లిదండ్రుల బాధ్యతను గుర్తెరిగేటట్లు చేస్తుంది.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అల్తాఫ్‌బాషా

కోడుమూరు రూరల్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల సమితి సభ్యుడు అల్తాఫ్‌బాషా కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విద్యా సంస్థలకు దసరా సెలవులను ప్రకటించినప్పటికీ ప్రైవేట్ విద్యా సంస్థలు యథేచ్ఛగా ప్రైవేట్ క్లాసులను నిర్వహిస్తున్నాయన్నారు. సమావేశంలో నాయకులు వీరేంద్ర, వినయ్, మునిస్వామి, అభి తదితరులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 5న నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 22న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. పశుసంవర్ధక శాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసన్నబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో నామినేషన్లు స్వీకరిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. మొత్తం 404 మంది ఓటర్లు ఉండగా రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. 7న నామినేషన్ల పరిశీలన, 8వ తేదీ ఉపసంహరణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 22న బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోనే ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ వెంటనే ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. అదే రోజున ఆఫీసు బేరర్ల ఎన్నిక జరుగుతుందని వెల్లడించారు.



నిరుపయోగం!

గడివేముల: పల్లెలను శుభ్రంగా ఉంచుతాం అంటూ పాలకులు చెబుతున్న మాటలు ఆచరణలో విరుద్ధంగా ఉంది. కనీసం ఇంటింటికీ చెత్త బుట్టలు సక్రమంగా అందజేయని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన గడివేముల ఎంపీడీఓ కార్యాలయంలో కొన్ని నెలనెల నుంచి ఓ గదిలో తడి,పొడి చెత్త సేకరణ డబ్బాలను పడేశారు. నేటికీ పంపిణీకి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెత్తడబ్బాలు పంపిణీ చేసి ఉంటే బాగుండేదని మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తడబ్బాలను పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

ఓర్వకల్లు: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఉచిత ఇసుక విధానం అమలు కోసం చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వెంకటేశ్వర్లుకు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, తన మంత్రివర్గం పదేపదే పేదలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్పా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మధుసూదన్, సుధాకర్, మాసూంబాష, భాస్కర్, శాలిబాష, అక్బర్‌బాష, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బాలికలను రక్షించడం బాధ్యత

పాణ్యం: బాలికల రక్షంచడం మన విధి అని కర్నూలు జిల్లా కోర్టు న్యాయవాది హేమలత లింగారెడ్డి పార్కొన్నారు. శక్రవారం నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీం ఇంజినీరింగ్ కళాశాలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డీన్ అశోక్, డాక్టర్ రామిరెడ్డి, మహిళ సాధికారిత విభాగం కో–ఆర్డినేటర్ హరిత పాల్గొన్నారు.